సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

కడప నగరంలోని 2వ డివిజన్ నానాపల్లి పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. - 8లో



సంబరంలో విషాదం

సంబరం విషాదంగా మారింది. గణేష్ నిమజ్జనంలో ఆనందంతో పాలుపంచుకున్న కొంత మంది తిరిగి ఇంటికి రాలేదు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.9 /23.8

వాతావరణం

జిల్లాలో సోమవారం 23.8 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

ఇ- క్రాపు, ఈకేవైసీ నమోదులో జిల్లాకు ప్రథస్థానం

కడప అగ్రికల్చర్ : ప్రస్తుత ఖరీఫ్‌సీజన్‌లో ఇ-క్రాప్, ఈకేవైసీ నమోదులో వైఎస్సార్ జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2.10 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయన్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలోని అగ్రి, హార్టికల్చర్ అసిస్టెంట్లు 2.06,588 ఎకరాల్లో అన్ని పంటలకు ఇ- క్రాప్ నమోదును పూర్తి చేశారన్నారు. రైతులు ఈ నెల 15వ తేదీలోగా ఇ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలిపారు.

కమలాపురంలో 8.4 మిల్లీమీటర్ల వర్షం

కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. కమలాపురం, మైదుకూరులలో అత్యధికంగా 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోపవరంలో 7.8, వేములలో 7, బద్వేల్‌లో 6.8, పొద్దుటూరు, జమ్మలమడుగు, వీఎన్‌పల్లిలలో 6.2, ఖాజీపేట, చాపాడులలో 6, కడపలో 5.4, చక్రాయపేటలో 5, దువ్వూరులో 4.8, బి.మఠంలో 3.6, బి. కోడూరులో 3.4, వల్లూరులో 3.2, సిద్దవటంలో 3, అట్లూరులో 2, సీకేదిన్నెలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

11న అండర్-14 క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 11వ తేదీ బుధవారం ఉదయం జిల్లాస్థాయి అండర్-14 క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. 01-09-2010 తర్వాత పుట్టిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు తమ వెంట ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్, 3 సంవత్సరాల ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను ఒరిజినల్స్‌తో పాటు ఒకసెట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు.

పులివెందుల జీజీహెచ్ ఆకస్మిక తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

పులివెందుల రూరల్ : పులివెందులలో నూతనంగా ఏర్పాటు చేసిన జీజీహెచ్, మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి జనరల్ హాస్పిటల్, టీచింగ్ హాస్పిటల్‌లో మౌలిక సదుపాయాలు, ఓపీ, ఐపీ బ్లాకులు, ఎమర్జెన్సీ వార్డులతో పాటు.. పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఏపీఎంఎస్ఐడీసీ కల్పించే సదుపాయాలు,వైద్య సిబ్బంది సంఖ్య గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులతో వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

గండికోట జలాశయానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కొండాపురం : గండికోట జలాశయానికి అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు-నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్) ప్రధాన కాలువ ద్వారా 9500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోందని జీఎన్ఎస్ఎస్ డీఈ ఉమమహేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయం పూర్తిసామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 22.5 టీఎంసీలు ఉన్నట్లు చెప్పారు. గండికోట ఎత్తిపోతల పథకం నుంచి ముడు మోటార్ల ద్వారా 1500 క్యూసెక్కులు, గండికోట లిఫ్ట్ ఇరిగేషన్(జీకెఎల్ఐ) నుంచి ఏడు మోటార్ల ద్వారా 770 క్యూసెక్కులు పంపింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేరళలో ఓనం పండుగ నేపథ్యంలో కాచిగూడ నుంచి కడప మీదుగా కొల్లంకు ఈనెల 14వ తేదీన ప్రత్యేక రైలు నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. కాచిగూడలో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి షాద్‌నగర్, జడ్చర్ల, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల మీదుగా కడపకు అర్ధరాత్రి 12.40 గంటలకు చేరుతుందన్నారు. అనంతరం రాజంపేట, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూరు, పాలక్కాడ్, త్రిశూర్, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, సెంగనసెట్టి, చెంగనూరు మీదుగా కొల్లాంకు రాత్రి 11.20కు చేరుతుందన్నారు. ఈనెల 16న కొల్లంలో బయలుదేరి ఇదే మార్గంలో కాచిగూడకు చేరుతుందన్నారు.

• నదులను చెరబట్టి..

ఇసుక కొల్లగొట్టి

ప్రకృతి సంపద వారి పాలిట కల్పతరువుగా మారింది. నదులు గుల్ల అవుతున్నాయి. యధేచ్చగా ఇసుక లూటీ చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం పచ్చనేతలు పోటీ పడుతున్నారు. చిత్రావతి, పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. పొక్లెయిన్ల ద్వారా లోడింగ్ చేస్తూ భారీ టిప్పర్లతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. స్థానికంగా వినియోగదారుడికి ఇసుక గత ప్రభుత్వం కంటే రెట్టింపు ధరకు లభిస్తోంది. పేరుకు మాత్రమే 'ఉచిత ఇసుక', అదో దోపిడీ పథకంగా మారింది.

- పెన్నాలో యధేచ్ఛగా అక్రమ రవాణా
- పాపాఘ్ని నదిని వదలని పచ్చనేతలు
- పార్నపల్లె కేంద్రంగా బెంగళూరుకు తరలింపు



పార్నపల్లె నుంచి ఇసుకను బెంగుళూరుకు తరలిస్తున్న టిప్పర్లు



హనుమాన్‌గుత్తి గ్రామంలోని నదిలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అక్రమ ఇసుక రవాణా యధేచ్ఛగా కొనసాగుతోంది. ఎన్నడూ లేని విధంగా చిత్రావతి నుంచి బెంగళూరుకు పచ్చనేతలు రేయింబవళ్లు ఇసుకను తరలిస్తున్నారు. స్థానికులు ఆవేదన చెందుతున్నా అటువైపు కన్నెత్తి చూసే సాహసం కూడా అధికార యంత్రాంగం చేయడం లేదు. ఇసుక అక్రమ రవాణాలో పచ్చనేతలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నప్పుడు మాత్రమే అధికారులు అటువైపు వెళ్తున్నారు తప్ప అక్రమ రవాణాను అడ్డుకున్నామన్న స్పృహ వారికి లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

అక్రమార్జన కోసం పోటాపోటీ....

అధికారం రాగానే కూటమి నేతలు అక్రమార్జన కోసం పోటీపడుతున్నారు. ఈక్రమంలో ప్రధానంగా మొదట పెన్నానదిపై పడ్డారు. కొండాపురం మొదలు హనుమాన్‌గుత్తి వరకు ఎంపీ రమేష్‌నాయుడు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు ఇసుక ద్వారా అక్రమార్జనకు తెరలేపారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో మొదలు పెడితే, అక్రమార్జన వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చుట్టుముట్టింది. పులివెందుల పరిధిలో చిత్రావతి, వేంపల్లె కేంద్రాలుగా పచ్చనేతల మధ్య ఈ వ్యవహారం కొనసాగింది. తర్వాత కమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరించి పాపాఘ్ని నదిని లూటీ చేస్తున్నారు. ఇక్కడ ఓ ఎస్ఐ ఏకంగా ట్రాక్టర్‌కు వారానికి రూ.15వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకొని మరీ ప్రోత్సహిస్తుండడం గమనార్హం. సదరు ఎస్ఐ పెట్టిన షరతులకు లోబడి పచ్చనేతలు కడపకు ఇసుకను ట్రాక్టర్లు ద్వారా తరలిస్తున్నారు.

రహదారి వేసి మరీ అక్రమ రవాణా..

నదుల్లోకి టిప్పర్లు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేసి మరీ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈవ్యవహారం పార్నపల్లె కేంద్రంగా భారీ స్థాయిలో కొనసాగుతోంది. ప్రభుత్వానికి పైసా రాయల్టీ చెల్లించకుండా ప్రకృతి సంపదను దోపిడీ చేస్తున్నారు. గ్రామస్తులు ప్రత్యక్షంగా ఆందోళన చేస్తే అధికారులు అడపాదడపా దాడులు చేస్తూ మమ అన్పించే చర్యలకు పాల్పడుతున్నారు తప్ప కట్టడి చేసే ప్రయత్నాలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పచ్చనేతల అక్రమ రవాణాను కట్టడి చేయకపోతే, భవిష్యత్ తరాలకు ఇసుక ఇలా ఉండేదని చెప్పుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడాల్సిన ఆవశ్యకత ఉంది.

గణనాథునికి వీడ్కోలు



పాతకడప చెరువులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : బొజ్జ గణపతిని మూడు రోజుల పాటు పూజించిన అనంతరం సోమవారం జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ సంవత్సరం 20 శాతం ఎక్కువ విగ్రహాలను పందిళ్లలో ఏర్పాటు చేశారు. మూడు రోజులు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు స్వామిని చూసేందుకు హాజరయ్యారు. నిర్వాహకులు వారందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. అక్కడక్కడ స్వల్ప సంఘటనలు చోటుచేసుకున్నా మొత్తంపై నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా అంతటా దాదాపు 90 శాతం విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను 7, 9 రోజుల్లో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.అక్కడక్కడ యువత అత్యుత్సాహం ప్రదర్శించడంతో స్వల్ప సంఘటనలు చోటుచేసుకున్నాయి. నీటి ప్రవాహాల వద్ద కూడా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నీరు సమృద్ధిగా ఉండడంతో యువత స్వయంగా నిమజ్జనానికి తరలి వెళ్లారు.



సిద్దవటం పెన్నానదిలో వినాయకుడిని నిమజ్జనం చేసిన దృశ్యం

నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



కుందూనది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చాపాడు : వినాయకుడి నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అన్ని శాఖలకు చెందిన అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుందూనదిపై నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన భారీ బారి కేడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో వినాయకుడి విగ్రహాలు కుందూనది వద్దకు నిమజ్జనం కోసం తీసుకువస్తారన్నారు. ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది నిమజ్జన పాయింట్ల వద్ద బందోబస్తుగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇదే క్రమంలో రాత్రి సమయంలో విద్యుత్ వెలుతురు నిత్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దారు యామిని, ఈఓఆర్డీ రాధాకృష్ణవేణి, వైద్యాధికారి డా.కావ్య మాధురి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

కలసపాడు : స్థానిక పోలీసుస్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. శిథిలమైన పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ కేంద్రం పరిశీలన



పీజీ ప్రవేశాల ప్రక్రియను పరిశీలిస్తున్న వీసీ

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రవేశాల ప్రక్రియను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పరిశీలించారు. ఏపీ పీజీ సెట్ అర్హత సాధించి వైవీయూలో సీట్లు పొందిన అభ్యర్థులు సంచాలకుల కార్యాలయానికి వచ్చారు. డీఓఏ సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మార్గదర్శకంలో విద్యార్థుల అర్హత పత్రాలు పరిశీలన చేసి సీట్లు కేటాయిస్తున్నారు. వీసీ, రిజిస్ట్రార్లు విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందుల గురించి ఆరా తీశారు. సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ స్పందిస్తూ తొలి విడతలో 363 మంది విద్యార్థులు వైవీయూ కళాశాలకు ఆప్షన్ ఇచ్చుకున్నారని అందులో 260 మంది ఇప్పటికే ప్రవేశాలు పొందారని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో డీఓఏ సహాయ సంచాలకులు డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ మునికుమారి, డాక్టర్ వసుగోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ రెడ్డయ్య, గణేష్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 08562- 258622, 244622 నంబర్లలో, kadapa.dcourts.gov.in, dlsakdp@gmail.comలలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

ఆశ.. నిరాశ

ఏన్నో అశలతో ఖరీఫ్ సాగును ఆరంభించిన రైతులకు ఈ ఏడాది నిరాశే మిగలనుంది. సీజన్ ముగింపునకు కేవలం 20 రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 49.90 శాతం మేర మాత్రమే పంటలు సాగయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 100 రోజులు గడిచినా ఇప్పటికీ సగానికి మించి(50 శాతం) సాగు కాలేదు. సీజన్ ఆరంభంలో వర్షాలు కురవడంతో పంటలు వేసినా అన్నదాతలకు చివరకు కడగండ్లే మిగిలాయి.

- ఈ ఏడాది ఖరీఫ్‌లో 49.31 శాతం మేర సాగైన పంటలు
- సీజన్ ముగింపునకు 20 రోజులే గడువు
- వరి సాగు వంద శాతం ప్రశ్నార్థకమే



ఖాజీపేటమండలంలో సాగైన మినుముపంట

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 75,189 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 37,518 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.అంటే 49.90 శాతం మేర మాత్రమే సాగయ్యాయి.దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. జూన్ నెల ఆరంభంలోనే వర్షం బాగా కురవడంతో చాలామంది రైతులు ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ, కంది, పత్తి సాగు చేశారు. కొన్ని రోజులు పంటలు పచ్చగా ఉన్నా తర్వాత వర్షాభావంతో వాడుముఖం పట్టాయి. జూలై తరువాత వరుణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. ఆగస్టు చివరి వరకు వర్షాలు పడలేదు. దీంతో ముందుగా సాగు చేసిన మినుముపంట ఎండిముఖం పట్టింది. కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లి, ఎర్రగుంట్ల, వేముల మండలాల్లో 5 వేల ఎకరాలకుపైగా మినుముపంట పూర్తిగా ఎండిపోయింది. మినుము రైతులు వేలకు వేలు నష్టాలను మూటగట్టుకున్నారు. వేరుశనగ, కంది, పత్తి పంటలు కూడా వాడుముఖం పట్టాయి. అయితే గత నెల 31వ తేదీ కురిసిన వర్షంతో ఆరుతడి పంటలకు కాసింత ప్రాణం వచ్చింది.

కేసీ కెనాల్‌కునీరు వచ్చినా ఊపందుకోని వరిసాగు...

కేసీ కెనాల్‌కు నీరు వచ్చినా ఈ ఏడాది ఖరీఫ్‌లో వందశాతం వరిపంట సాగయ్యేలా కనిపించలేదు. నీరు వచ్చి నెల రోజులు దాటినా సాగు ఇంకా ఊపందుకోలేదు. కేసీ కెనాల్ పరిధిలోని దువ్వూరు మండలంలో సాధారణసాగు 2999 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 365 హెక్టార్లలో మాత్రమే సాగైంది. మైదుకూరు మండలంలో 1224.8 హెక్టార్లకు 115 హెక్టార్లలోనూ, ఖాజీపేట మండలంలో 3339.8 హెక్టార్లకు 315 హెక్టార్లలో, చాపాడు మండలంలో 5284.4 హెక్టార్లకు 1645 హెక్టార్లలో మాత్రమే వరిపంట సాగైంది. కేసీకెనాల్ పరిధిలోని ప్రధాన మండలాల పరిధిలో సాధారణసాగు 12848.4 హెక్టార్లు ఉంటే 2440 హెక్టార్లలో మాత్రమే వరి సాగైంది.

జిల్లావ్యాప్తంగా 13445 హెక్టార్లలోనే

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వరి సాధారణ సాగు లక్ష్యం 31171 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు కేవలం 13445 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఇక ఖరీఫ్ సీజన్ ముగింపునకు 20 రోజులు మాత్రమే గడువు ఉంది. గడువులోపు 50 శాతం మించి పంటలు సాగయ్యే అవకాశాలు కనిపించడం లేదని పలువురు రైతులు తెలిపారు.

వందశాతం మించి సాగైన మొక్కజొన్న, మినుము..

ఖరీఫ్ సీజన్‌కు కేవలం మినుము, మొక్కజొన్న, కంది పంటలు మాత్రమే వందశాతం మించి సాగయ్యాయి. మినుము 2642 హెక్టార్లకు 5036 హెక్టార్లలో సాగై 190.61 శాతం నమోదైంది. అలాగే మొక్కజొన్న 637 హెక్టార్లకు 1432 హెక్టార్లలో సాగై 224.73 శాతం మేర, కంది 3894 హెక్టార్లకు 4279 హెక్టార్లలో సాగై 109.89 శాతంగా నమోదైంది.

జిల్లాలో పంటలసాగు వివరాలు (హెక్టార్లలో)

పంట	సాధారణ సాగు	ప్రస్తుతం సాగైంది	సాగు శాతం
మొక్కజొన్న	637	1438	225.67
మినుము	2642	5036	190.61
కంది	3894	4279	109.90
కొర్ర	976	935	95.76
సజ్జలు	1039	545	52.48
నువ్వు	19	09	47.37
ఆముదం	821	361	43.97
వరి	31171	13445	43.13
చెరకు	94	45	39.36
వేరుశనగ	5971	2315	38.78
సోయాబీన్	963	361	37.51
పత్తి	24086	8441	35.04
పెసలు	250	80	31.93
సన్‌ఫ్లవర్	1126	170	15.06

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షపాతం వివరాలు.. (ఆగస్టు 31వ తేదీనాటికి)

నెల	సాధారణ వర్షం	కురిసినది	వ్యత్యాసం
జూన్	68.2	138.4	102.9(అధికవర్షం)
జులై	96.7	55.4	- 42.7(లోటు వర్షం)
ఆగస్టు	118.4	97.4	- 15.0(లోటు వర్షం)
సెప్టెంబర్	120.0	-	-

ఆశలన్నీ రబీపైనే...



నేను ఈ ఖరీఫ్ సీజన్‌లో 10 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. తీవ్ర వర్షాభావం వల్ల పూర్తిగా ఎండిపోయింది. దీంతో పంటను దున్నేయాల్సి వచ్చింది. ఫలితంగా రూ. లక్షా 50 వేల దాకా నష్ట వచ్చింది. రబీపైనే రైతులందరూ ఆశలు పెట్టుకున్నారు. అన్నివిధాలా వాతావరణ అనుకూలిస్తే ఈ రబీలో శనగపంట సాగు చేయాలనుకుంటున్నా.

– బొగ్గుల జయరామిరెడ్డి, కంచన్నగారి పల్లె, కమలాపురం మండలం

కృషి చేస్తున్నాం...



ఖరీఫ్ సాగు లక్ష్యానికి కృషి చేస్తున్నాం. అయితే వాతావరణం అనుకున్న మేర అనుకూలించలేదు. దీంతోపాటు తీవ్ర వర్షాభావ పరిస్థితులవల్ల సాగులో కొంత వెనకపడాల్సి వచ్చింది. ఇటీవలే కేసీకి నీరు రావడంతోపాటు కొంత మేర వర్షాలు కూడా కురుస్తున్నాయి. దీంతో సాగు ఊపందుకుంది. లక్ష్యం సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

50 శాతం మించి సాగైన పంటల వివరాలు...

జిల్లాలో కొర్ర, కంది, సజ్జ పంటలు మాత్రమే 50 శాతం మించి సాగయ్యాయి. ఇందులో సజ్జ 1039 హెక్టార్లకు 545 హెక్టార్లలో మాత్రమే సాగైంది. కొర్ర పంట 976 హెక్టార్లకు 932 హెక్టార్లలో సాగై 95.76 శాతం నమోదైంది. వరి, పెసలు, వేరుశనగ, నువ్వు, సన్‌ఫ్లవర్, ఆముదం , సోయాబీన్, పత్తి, చెరకు పంటలు 50 శాతానికి లోపే సాగయ్యాయి.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం



కడప కలెక్టరేట్‌లో స్టాఫ్‌నర్సు బి.చిన్నమ్మతో మాట్లాడుతున్న పోలీసులు

కడప అర్బన్ : కడపలో కలెక్టర్ అండ్ జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం ఆవరణలో సోమవారం బి.చిన్నమ్మ అనే స్టాఫ్‌నర్స్ క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తనను డాక్టర్ చెన్నకృష్ణ మాయమాటలు చెప్పి 11 ఏళ్ల క్రితం వివాహం చేసుకుని మోసం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అతనితోపాటు, మరో ఇద్దరు తనపై హత్యాయత్నం చేసేందుకు పలు రకాలుగా ప్రయత్నిస్తున్నారని, పోలీసుల చుట్టూ తిరిగినా న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. సంఘటన స్థలానికి కడప ఒన్‌టౌన్ పోలీసులు వచ్చి స్టాఫ్ నర్సుతో మాట్లాడారు. వైద్య పరీక్షల కోసం ఆమెను ఆసుపత్రికి పంపించారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలియజేశారు.

గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదుల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్, గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమాల్లో కడప ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటపతి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిశీలించి తగిన పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపారు.

■ తమ గ్రామ పొలం సర్వే నంబరు 268/ఏ1లోని నాలుగు ఎకరాలను తాను 50 ఏళ్ల క్రితం కొనుగోలు చేశానని, ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ వేముల మండలం పెద్దజూటూరు గ్రామానికి చెందిన ఎస్.బాలిరెడ్డి కోరారు.

■ పాడా నిధుల నుంచి డ్రైనేజీ స్కీం కోసం నిధులు మంజూరయ్యాయని, అయితే కొంత మేర మాత్రమే పనులు జరిగాయని, మిగిలిన పనులను కూడా పూర్తి చేయాలని సింహాద్రిపురం మండలం ముసలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బి.రఘునాథరెడ్డి కోరారు.

■ వారసత్వంగా తనకు లభించిన భూమిని కొందరు కబ్జా చేశారని, తన భూమిని తనకు ఇప్పించాలని పెద్దముడియం మండలం కొండ పాపాయపల్లెకు చెందిన కె.సుబ్బారెడ్డి కోరారు.

సంబరంలో విషాదం

సంబరం విషాదంగా మారింది. గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడో రోజైన సోమవారం వైభవంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. విగ్రహాలను ఊరేగింపుగా, ఉత్సాహ భరితంగా తీసుకెళ్లారు. ఎంతో ఆనందంతో పాలుపంచుకున్న ఐదుగురు తిరిగి ఇంటికి రాలేదు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

- వినాయక నిమజ్జనంలో అపశ్రుతి
- వైఎస్సార్ జిల్లాలో ముగ్గురు దుర్మరణం
- అన్నమయ్య జిల్లాలో ఇద్దరు మృతి
- పలువురికి గాయాలు
- మిన్నంటిన బాధితుల ఆర్తనాదాలు



వంశీ



రాజ



వీరపునాయునిపల్లె మొగమూరు వాగు వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలంలోని మొగమూరు వాగులో ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. వేంపల్లె పట్టణానికి చెందిన కొంత మంది వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వీరపునాయునిపల్లె మండలంలోని యస్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న మొగమూరు వాగు వద్దకు తీసుకువచ్చారు. నీటిలోకి వదులుతుండగా ప్రతిమతోపాటు ప్రమాదవశాత్తు వంశీ(25), రాజ(40) వాగులో పడిపోయారు. విషయం తెలుసుకొన్న ఎస్సై మంజునాథ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి స్థానికుల సాయంతో గల్లంతయిన వారిని వెలికితీసే కార్యక్రమం చేపట్టారు. ఫలితం దక్కక పోవడంతో పులివెందుల నుంచి ఫైర్‌స్టేషన్ సిబ్బందిని పిలిపించారు. స్థానికుల సహకారంతో దాదాపు 5 గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, వంశీకి ఇంకా పెళ్లి కాలేదు. రాజ అనే వ్యక్తికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు.. ఒక మగపిల్లవాడు ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

గుండెపోటుతో..



సుబ్బరామయ్య (ఫైల్)

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలంలోని దుద్యాల గ్రామంలో పెద్దకోడివాండ్లపల్లెకు చెందిన ఉప్పు సుబ్బరామయ్య (54) వినాయక చవితి సందర్భంగా తన సొంత ఖర్చుతో గణేషుడి విగ్రహాన్ని గ్రామస్తులకు అందజేశాడు. ఈ క్రమంలో సోమవారం నిమజ్జనానికి తరలిస్తుండగా స్వామికి టెంకాయకొట్టి పూజలు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు.

● ట్రాక్టర్ కిందపడి..



గౌతం (ఫైల్)

చక్రాయపేట : వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలంలోని నెరుసుపల్లె వద్ద ట్రాక్టర్ కింద పడి పోలేపల్లి గౌతం (17) అనే ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గౌతం అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె సమీపాన ఉన్న అంగళ్లకు చెందిన నాగరాజు కుమారుడు. అతను చక్రాయపేట మండలం ఆంజనేయపురంలోని తమ బంధువుల ఇంటిలో ఉంటూ రాయచోటిలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రోజూ ఆంజనేయపురం నుంచి రాయచోటికి వచ్చి, వెళ్లేవాడు. వినాయక చవితి సందర్భంగా ఆంజనేయ పురంలో గ్రామస్తులందరూ కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తక్కలపల్లి సమీపాన ఉన్న కాలేటి వాగుకు తీసుకెళ్లి నిమజ్జనం చేసి కుప్పం బురుజుపల్లె, నెరుసుపల్లె మీదుగా ఆంజనేయపురానికి ట్రాక్టర్ వస్తుండేవారు. నిరసుపల్లె వద్దకు రాగానే గౌతమ్ ఎగిరి ట్రాక్టర్ ట్రాలీ కింద పడ్డాడు. దీంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయపురానికి చెందిన ఆదిత్య అనే మరో యువకుడు కూడా ట్రాక్టర్లో నుంచి కిందపడ్డాడు. ఇతడికి స్వల్ప గాయాలు తగిలాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

● చెరువులో ట్రాక్టర్ బోల్తా

- ఒకరు మృతి
- 8 మందికి తీవ్ర గాయాలు





మృతి చెందిన అఫ్జల్, రోదిస్తున్న మృతుడి తల్లి అలంబి

పెద్దమండ్యం : అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లె పంచాయతీ గుడిశవారిపల్లె చెరువు వద్ద వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గుడిశవారిపల్లె నుంచి పది మందితో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయింది. ఈ సంఘటనలో పి.తురకపల్లెకు చెందిన 11 ఏళ్ల అఫ్జల్ మృతి చెందగా, పి.తురకపల్లె, గుడిశవారిపల్లెకు చెందిన రెడ్డి సంజీవ, జాఫర్ వలీ, ఖాజా, హర్షద్, సుబహాన్, అమీన్, అర్షద్, రెడ్డి బాషాలకు తీవ్ర గాయాలయ్యాయి. పి.తురకపల్లెకు చెందిన మౌలాసాహెబ్‌కు అఫ్జల్ ఒక్కగానొక్క కుమారుడు. ముగ్గురు ఆడ పిల్లల తరువాత కుమారుడు పుట్టాడు. ఆ బాలుడు యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. బిడ్డల పోషణ కోసం తండ్రి మౌలాసాహెబ్ ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లారు.



చెరువులో బోల్తా పడిన ట్రాక్టర్

గండి క్షేత్రంలో ఉద్యోగిపై విష ప్రయోగం

చక్రాయపేట : ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రంలోని అన్నదాన సత్రంలో పని చేస్తున్న రెడ్డయ్య అనే ఉద్యోగిపై విష ప్రయోగం జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సత్రంలో వంట మనిషిగా పని చేస్తున్న వ్యక్తి వాటర్ బాటిల్‌లో విషం కలిపినట్లు సీసీ కెమెరా పుటేజీ ద్వారా తెలియడంతో అతడి పైన చర్యలకు ఆలయ అధికారి సమాయత్తమయ్యారు. వివరాలిలా ఉన్నాయి.

దేవస్థానంలో జంపు రెడ్డయ్య అనే వ్యక్తి అన్నదాన సత్రం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఇక్కడే వంట మనిషిగా పని చేస్తున్న కె.రెడ్డయ్య అనే వ్యక్తిని విధి నిర్వహణలో భాగంగా రెండు రోజుల క్రితం ఆయన మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న వంట మనిషి అన్నదానం సత్రం ఇన్‌చార్జి ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిల్‌లో ఏదో విషం కలిపాడు. ఆ విషయం తెలియని సత్రం ఇన్‌చార్జి బాటిల్‌లో ఉన్న నీటిని రెండు, మూడు గుటికలు తాగారు. అంతలోనే గొంతు పట్టేసినట్లు అనిపించడం, ఒక విధమైన వాసన రావడంతో బాటిల్‌ను కదిలించాడు.

దీంతో బాటిల్‌లో నీరు రంగు మారి నురుగు రావడంతో తోటి ఉద్యోగులకు చూపించాడు. వెంటనే ఆలయ అధికారి వెంకటసుబ్బయ్యకు సమాచారం అందించి వేంపల్లి వైద్యశాలకు వెళ్లాడు. అప్పటికే జంపు రెడ్డయ్యకు వాంతులు, విరేచనాలతోపాటు కడుపునొప్పి కూడా రావడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. వెంటనే ఆలయంలో పని చేస్తున్న సిబ్బంది అన్నదాన సత్రంలో ఉన్న సీసీ కెమెరాలు పుటేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటమనిషి కె.రెడ్డయ్య బాటిల్‌లో ఏదో కలిపి బాగా కదిపి అక్కడే పెట్టి వెళ్లిన దృశ్యం కనిపించింది. దీంతో అందరూ అతడిని తీవ్రంగా మందలించారు. వెంటనే ఆలయ అధికారికి చెప్పడంతో ఆయన తాను వచ్చేవరకు అతడిని విధులకు రానీయవద్దని చెప్పారు.

సోమవారం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య మరోమారు పుటేజీని పరిశీలించి అతడిపై చర్యలకు ఉపక్రమించారు. వాటర్ బాటిల్‌లో మందు కలిపిన వంట మనిషిపై చర్యలు తీసుకోవాలని ఆర్కే వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

కావలెను

❖ బ్రాంచ్ అడ్మిన్: డిగ్రీ చదివి కనీసం 10 సం॥ల జనరల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పబ్లిక్ రిలేషన్‌షిప్‌లో అనుభవం కలిగి ఉండవలెను.
❖ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్: 10th పాస్ అయ్యి ఉండి, ఫీల్డ్ వర్క్- ఆటోమొబైల్స్ / కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ / ఫైనాన్స్ / FMCG రంగాలలో సేల్స్ / మార్కెటింగ్ / కలెక్షన్స్‌లలో కనీసం 3 సం॥ల అనుభవం కలిగి ఉండవలెను. జీతం: రూ.25,000/-ల నుండి
కొత్తవారు కూడా సంప్రదించవచ్చును.
ప్రాంతాలు: కడప, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల చుట్టుప్రక్కన ప్రాంతాలు
ఇంటర్వ్యూ తేది: 14 సెప్టెంబర్ 2024, ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 2 గం॥ల వరకు
మేరు ఆటోమొబైల్స్ ప్రై.లిమిటెడ్
మోడమీదపల్లె, NH-18, కడప. ఫోన్: 9849791770

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్. ఒకే సం॥లో డిస్ కంటిన్యూ విద్యార్థులకు 109, ఇంటర్, డిగ్రీ, PG Diploma, B.Tech., BCA, MCA, MBA పాసయ్యే ఛాన్స్ కలదు. కడప 75694 70023

SERIVCES
BUSINESS OFFER
■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రొపర్టీలోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7015882322

CHANGE OF NAME
■ I, SHAIK SHAVALI SAHEB (Old Name), S/o Shaik Hasan Saheb, resident of new D.No: 2-2049, old D.No:2-875/1, RTC Nallagutta, Piler Town,(P)& (M), Annamayya District, A.P. I have changed my name from SHAIK SHAVALI (New Name), S/o Shaik Hasan Saheb.

WANTED
■ Wanted Qualified & Exp. Teachers and Faculties for Reputed High School & Junior College in Rayachoti. Attractive Salary for the right Person. 7093473533/8019349545, Email: ssvbrct@gmail.com
■ Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9502712418(Work from Home available)

■ మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208
■ ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు Teem కావలెను. మరియు రిటైర్డ్ ఎంప్లాయిస్ House wifes, LIC ఏజెంట్స్ Qul: 10th Pass. Cont: 9398875236, 8977624599
■ కర్నూలులో కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 9182280297.
■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధుల ను,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640528899, 9640648899
■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుంచి 34000 రూము+భోజనం ఫ్రీ. Ph: 9133671684

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి / క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి: 97059 07418, 97059 44423, 90102 23797, 90100 72409

జగనన్న కాలనీలో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



మట్టి అక్రమ రవాణా వల్ల ఏర్పడిన గుంతలు



పోలీసులు పట్టుకున్న టీడీపీ నేతకు చెందిన టిప్పర్

- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 2వ డివిజన్ నానాపల్లి పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లోని మట్టిని.. ఇప్పుడు అక్రమంగా తోడేస్తున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, మైనింగ్, కార్పొరేషన్ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. నగరానికి దూరంగా ఉన్న ఈ కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి ఇసుక, సిమెంటు, ఇటుకలు, స్టీల్ రవాణా ఖర్చులు పెరిగి పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఇచ్చిన ఇంటి స్థలాల్లో జేసీబీలతో గోతులు తీసి మట్టిని తరలించడం పట్ల లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. వారు తిరిగి ఆ గుంతలను పూడ్చుకోవాలంటే ఒక జీవితకాలం సరిపోదు. ఇంటి నిర్మాణం మాట దేవుడెరుగు.. గుంతలు పూడ్చి పునాది నిర్మించడానికే లక్షల రూపాయలు ఖర్చవుతుంది. 4వ డివిజన్ ఇన్‌చార్జినని చెప్పుకుంటున్న ఓ టీడీపీ నేత తన జేసీబీ, టిప్పర్‌లతో రాత్రిపూట ఇష్టానుసారంగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.10 వేలకు అమ్ముకుంటూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కొండ గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న ఈయన కొన్నాళ్ల స్తబ్దుగా ఉన్నాడు. ఇటీవల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పిలిపించి మాట్లాడటంతో మళ్లీ అక్రమ రవాణాకు తెరతీసినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో.. ఈ నెల 7వ తేదీ చిన్నచౌకు పోలీసులు అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. వారిపై సదరు టీడీపీ నేత తన టిప్పర్‌నే పట్టుకునేంత ధైర్యమా.. అంటూ రెచ్చిపోయినట్లు సమాచారం. స్థానిక టీడీపీ నేతలతో ఒత్తిడి తెచ్చి టిప్పర్‌ను విడిపించుకునే యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే పనులు చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నా కింది స్థాయి నేతలు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. మట్టి అక్రమ రవాణా చేయడం వల్ల ఆయా ప్లాట్లలో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. నంబర్ రాళ్లు పోయి ఎక్కడ ఏ ప్లాటు ఉందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రెవెన్యూ, నగరపాలక, మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని హౌసింగ్ లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

- కబ్జాకోరుకు అధికార పార్టీ నేతల అండదండలు
- అధికారులకు స్థానికుల ఫిర్యాదు



ఆక్రమిత భూమిలో నోటీసు బోర్డు ఏర్పాటు



నోటీసు బోర్డును తొలగించిన దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్ : రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా ఆక్రమణలో ఉన్న భూములను విడిపించడంతోపాటు రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల భూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ఓవైపు చెబుతోంది. కానీ అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో కొందరు రెచ్చిపోతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. ఇది ప్రభుత్వ భూమి అంటూ స్వయాన తహసీల్దార్ ఏర్పాటు చేసిన బోర్డులను సైతం తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. చక్రాయపేట మండలం నాగలగుట్టపల్లె గ్రామ పొలం సర్వే నంబరు 115/1, 115/2, 115/3, 115/4లోని కాలువ, రహదారి, దేవునిమాన్యం భూములను అదే గ్రామానికి చెందిన బాలం శ్రీరాములు అనే వ్యక్తి ఆక్రమించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే వాల్టా చట్టానికి విరుద్ధంగా ఆ వ్యక్తి వ్యవసాయ బోరు బావిని సైతం ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. బోరు బావితోపాటు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించారని అంటున్నారు. ఈ అంశంపై చక్రాయపేట తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. తహసీల్దార్ స్వయంగా ఆ భూమిని పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించి బోర్డును ఏర్పాటు చేశారు. తహసీల్దార్ అక్కడి నుంచి వెళ్లగానే స్థానిక అధికార పార్టీ నాయకుల అండతో ఆ వ్యక్తి బోర్డును తొలగించి భూమిని ఆక్రమించినట్లు తెలుస్తోంది. నాగులగుట్టపల్లెకు చెందిన కొవ్వూరు ప్రదీప్‌రెడ్డి ఈ విషయాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలు తొలగించడంతోపాటు వాల్టా చట్టానికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ బోరు బావికి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయరాదని కోరారు. దీనిపై తక్షణమే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

తుదిదశకు చేరుకున్న క్రికెట్ టోర్నీ



మహేంద్రారెడ్డి, అనంతపురం, (91 పరుగులు)



అఖిల్, నెల్లూరు, (6 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ తుదిదశకు చేరుకుంది. సోమవారం వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 84 ఓవర్లలో 307 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని మహేంద్రారెడ్డి 72 బంతుల్లో 91 పరుగులు చేయగా, వీరారెడ్డి 64 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు 62.2 ఓవర్లలో 222 పరుగులు చేసి ఆలౌట్ అయింది. నెల్లూరు బౌలర్ అఖిల్ 6 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

● రికార్డు ధర పలికిన లడ్డూలు

జిల్లాలో ఈ ఏడాది లంబోదరుడి లడ్డూ ప్రసాదాలు రికార్డు స్థాయిలో ధర పలికాయి. వినాయక చవితి ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం భారీగా వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. స్వామి వారి ప్రసాదం అందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. మండపం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు పంపిణీ చేశారు.

పులివెందులలో అత్యధికం



లడ్డూను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందులలోని యర్రగుడిపాలెం గిరి రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద 9 కేజీల లడ్డూకు వేలం పాట నిర్వహించారు. ఎంఆర్ క్రియేటివ్ ఆగ్రోఫామ్ ల్యాండ్, శ్రీగంధం ఫామ్ ల్యాండ్ యజమానులు మల్లారెడ్డి, మోహన్‌రెడ్డిలు రూ.2.50 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. వారిని కార్యనిర్వాహకులు రాజేశ్వర్‌రెడ్డి దుశ్శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

ఎం.కొత్తపేటలో రూ.2.10 లక్షలు



లడ్డూ దక్కించుకున్న సుబ్బారెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని ఎం.కొత్తపేట గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. సంగటి సుబ్బారెడ్డి (బదర్స్) రూ.2,10 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. నాగాయపల్లెలో మాజీ ఎంపీటీసీ పెద్దపుల్లారెడ్డి రూ.1.60 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు.

కలమల్లలో రూ.2.24 లక్షలు



లడ్డూ, డాలర్‌ను దక్కించుకున్న వారికి సన్మానం చేస్తున్న నిర్వాహకులు

ఎర్రగుంట్ల : మండల పరిధి కలమల్ల గ్రామంలోని కృష్ణానగర్ వరసిద్ధి వినాయక ఉత్సవ యూత్ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ, బంగారు డాలరుకు వేలం పాట నిర్వహించారు. రెండూ కలిపి రూ.2.24 లక్షలు పలికినవి. రూ.1.58 లక్షలకు లడ్డూను కొప్పర్తి రామాజంనేయరెడ్డి, రూ.66 వేలకు డాలరును మాలే నల్లపరెడ్డి దక్కించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ నిర్వాహకులు సన్మానించి లడ్డూ, డాలరుతో ఊరేగింపు నిర్వహించారు.

కమలకూరులో రూ.1.70 లక్షలు



లడ్డూతో ఊరేగింపుగా బాలకోటయ్య

అట్లూరు : మండలంలోని కమలకూరు గ్రామంలో సోదినపల్లి చెంచుసుబ్బారెడ్డి 15 కిలోల బరువు ఉన్న లడ్డూను వినాయక విగ్రహం వద్ద ఉత్సవాల్లో ఉంచారు. మోపూరి పెద్దకోటయ్య రూ.1.70 లక్షలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు.

ఏటూరు గ్రామంలో..



లడ్డూతో దామోదర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

ఖాజీపేట : మండలంలోని ఏటూరు గ్రామంలో బొగ్గుల దామోదర్‌రెడ్డి రూ.1.04,000లకు లడ్డూ దక్కించుకున్నారు. దుంపలగట్టు గ్రామంలో మల్లెం అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.72,000, అగ్రహారంలో రామ్మోహన్ రూ.12,100, కూనవారిపల్లె గ్రామంలో రెడ్డెరి బాలకృష్ణారెడ్డి రూ.31,500, టీచర్స్‌కాలనీలో ఇండ్ల సుబ్బారెడ్డి రూ. 16,000, బీసీ కాలనీలో గంగిరెడ్డి మదుసూధన్‌రెడ్డి రూ 18,000 లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు.

సీతారామాపురంలో..

చాపాడు : మండలంలోని సీతారామాపురం గ్రామంలో యూత్ సభ్యులు రూ.56,500లకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు.

వీఎన్‌పల్లెలో 1.62 లక్షలు



రామ్‌ప్రసాద్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని నడివీధి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూకు వేలం పాట నిర్వహించారు. గతేడాది 1.15 లక్షలు పలకగా ఈ ఏడాది 1.62 లక్షలు పలికింది. వీరపునాయునిపల్లెకు చెందిన నర్రావుల రామ్‌ప్రసాద్‌రెడ్డి దక్కించుకొన్నారు. మండపం వద్ద నుంచి గ్రామోత్సవంగా తీసుకెళ్లారు. అనంతరం భక్తులకు పంచి పెట్టారు.

కొండారెడ్డివీధిలో రూ.99 వేలు



లడ్డూను సొంతం చేసుకున్న రామచంద్రారెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక 10వ వార్డులోని ఆంజనేయనగర్ కొండారెడ్డివీధిలో వినాయక స్వామి వద్ద ఉంచిన లడ్డూను రూ.99 వేలకు బద్వేలు మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్ మాలే రామచంద్రారెడ్డి సొంతం చేసుకున్నారు. అలాగే వెంకటయ్యనగర్‌లోని మేదరవీధి రెండవ లైన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను రూ.75 వేలకు మేడం రఘురామ్ దక్కించుకున్నాడు.